క్లుప్తంగా

కడియం ఇన్‌స్పెక్టర్‌గా తులసీధర్



కడియం: స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.తులసీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా గుడివాడ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇక్కడ పని చేస్తున్న పీవీజీ తిలక్ భీమవరం ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

బొమ్మూరు ఇన్‌స్పెక్టర్‌గా ఉమర్



రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మహమ్మద్ ఉమర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కమిషనరేట్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. బొమ్మూరులో ఇప్పటి వరకూ పనిచేసిన రాయుడు విజయకుమార్ విజయవాడ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఉమర్ జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ను, తూర్పు మండల డీఎస్పీ కిశోర్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమర్‌కు ఎస్సైలు జగన్‌మోహన్, జుబేర్, ఏఎస్సై ఉమామహేశ్వరరావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చందనను కలసిన సీఐ వినయ్‌మోహన్



చందన నాగేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ వినయ్‌మోహన్

ధవళేశ్వరం: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వినయ్‌మోహన్ గురువారం రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రముఖ ఆడిటర్ సూర్యప్రకాశరావు మృతి



రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రముఖ ఆడిటర్, సామాజిక, ఆధ్యాత్మిక వేత్త విశ్వనాథం సూర్యప్రకాశరావు (83) గురువారం తుదిశ్వాస విడిచారు. రాజమహేంద్రవరంలో తొలితరం ఆడిటర్ల కుటుంబంగా పేరొందిన వీబీఆర్ శర్మ నాలుగో కుమారుడైన సూర్యప్రకాశరావు ఐదు దశాబ్దాలుగా వృత్తిలో రాణిస్తూ పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీదత్తాత్రేయ వేద గురుకులం, శ్రీగణపతి సచ్చిదానంద దత్తపీఠం, విరించి వానప్రస్థ ఆశ్రమం వంటి పలు ఆధ్యాత్మిక, సేవ సంస్థలకు సూర్యప్రకాశరావు సారధ్య బాధ్యతలు నిర్వహించారు. ఆయన మృతికి నగరంలో పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గురువారం కోరుకొండ బస్టాండ్‌లో అడోనా వర్షిప్ సంస్థ ఆధ్వర్యంలో సువార్త సంగీత సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ క్రీస్తు ఆరాధనతో సకల శుభాలు కలుగుతాయన్నారు.

దుర్గేష్‌కు పరామర్శ

సీటీఆర్ఐ: సతీ వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌ను గురువారం నగరంలోని ఆయన స్వగృహంలో పలువురు పరామర్శించారు. దుర్గేష్ సతీమణి ఉషారాణి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి జనసేన పార్టీ నాయకుడు కొణిదెల నాగేంద్రబాబు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సినిమాలు



శ్యామల	: సైంధవ్
సూర్యమినీ	: 105 మినిట్స్
సూర్యప్యాలెస్	: ఫైటర్
స్వామి	: అయలాన్
శివజ్యోతి	: నా సామిరంగా
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: నా సామిరంగా
రంభ	: కెప్టెన్ మిల్లర్
మేనక	: డెవిల్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: గుంటూరు కారం

నామవరం:
వీఎస్.మహల్: హనుమాన్

ధవళేశ్వరం:
మురళీకృష్ణ : కెప్టెన్ మిల్లర్

కడియం:
వెంకటసూర్య: హనుమాన్

మహిళలకు కొండంత ఆసరా



మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో కమిషనర్ దినేష్‌కుమార్

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: మహిళల ఆర్థిక పరిపుష్టికి ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం కొండంత భరోసా కల్పిస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక 24, 30, 47, 48 డివిజన్‌లకు చెందిన మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ కుల, మత, పార్టీ, ప్రాంత, వర్గాలు చూడకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించారన్నారు. గత టీడీపీ పాలనలో పెన్షన్, రేషన్ కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులిస్తేనే పనులయ్యేవన్నారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ విజయం ఖాయమన్నారు. నగరాభివృద్ధికి పాటుపడుతూనే ఉంటానన్నారు. సీఎంగా జగనన్నను, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ సత్యవేణి, మిషన్ మేనేజర్ రవిశంకర్, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పోలు విజయలక్ష్మి, కొత్తా విజయరాజ్యలక్ష్మి, అరవ సురేష్, కాటం రజనీకాంత్, కాటం ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నగరానికి ప్రత్యేక ఆకర్షణగా క్వారీ సెంటర్

నగరాన్ని బహుముఖంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో క్వారీ సెంటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక క్వారీ సెంటర్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ కె.దినేష్‌కుమార్‌తో కలసి ఆయన సమీక్షించారు. ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ జంక్షన్ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఆర్ఎంసీ అధికారులతో ఎంపీ చర్చించారు. క్వారీ సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు తెలిపారు. పార్లమెంట్ భవన నమూనాలో అద్భుత వేదికను నిర్మించి దానిపై భారీ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒకవైపు జంక్షన్ అభివృద్ధి, మరోవైపు సెంటర్ అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ అలీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బర్రే కొండబాబు, అజ్జరపు వాసు, గుత్తుల మురళీధర్, మార్తి నాగేశ్వరరావు, కాటం రజనీకాంత్, దాసి వెంకట్రావు, చోడిశెట్టి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి 'గుడ్ మార్నింగ్'



గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో హోటల్ నిర్వాహకురాలు వరలక్ష్మితో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, మంత్రి చెల్లుబోయిన వేణు
- పారిశుధ్యానికి అంతా సహకరించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధి రూరల్ నియోజకవర్గ డివిజన్లలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం ఉదయం ఆయన స్థానిక 18వ డివిజన్‌లో పార్టీ నాయకులతో కలసి గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కొండావారి వీధి, పాలికవారి వీధి, గుత్తులవారి వీధి, కేతావారి వీధి, ఉరంవారి వీధి, కట్టుమూరువారి వీధి, గోడేవారి వీధి, చెల్లెవారి వీధుల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా నగరపాలక సంస్థ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి పథకాలు దరిచేరాయన్నారు. పేదల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. స్థానికంగా బడ్డీ హోటల్ నడుపుతున్న రాయుడు వరలక్ష్మితో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏమైనా ఆర్థిక ప్రయోజనం చేకూరిందా అని అడిగారు. చేయూత, ఆసరా, పెన్షన్, జగనన్న కాలనీలో ఇంటి స్థలాన్ని కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఆమె సంతోషంగా చెప్పింది. అనంతరం మంత్రి ఆమె హోటల్‌లో దోసెలు వేసి విక్రయించారు. మెరుగైన శానిటేషన్‌కు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎ.వినూత్నను ఆయన ఆదేశించారు. డివిజన్ వైఎస్సార్ సీపీ నేతలు అంగాడి సత్యప్రియ, దమ్ము ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజినీర్ పాండురంగారావు, వైఎస్సార్ సీపీ నేత, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి, నగరపాలక సంస్థ డివిజన్‌ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, డివిజన్ జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టిప్రసాద్ బాబు (రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు పడమటి కామరాజు, నాగమణి, షేక్ ఇమామ్, కొల్లేటి వరలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కృషి మరువలేనిది

మంత్రి శ్రీనివాసవేణుగోపాలకృష్ణ



పారిశుధ్య కార్మికులతో కలసి డ్రైనేజీలో చెత్త తొలగిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: పారిశుధ్య కార్మికుల కృషి మరువలేనిదని బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరంలో స్వచ్ఛత.. మన బాధ్యత కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. స్థానిక ప్రధాన రహదారి, అగ్రహారం తదితర ప్రాంతాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీల్లో పూడికలు తొలగించారు. అనంతరం పారిశుధ్య ట్రాక్టర్‌ను నడిపారు. మంత్రి మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, బర్రి కామేశ్వరరావు, పేర్ల బాసి, పట్టపగలు వెంకటలక్ష్మి, పారోజు ముత్యాలు, ధర్మ, బాబి తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు పునరుద్ధరించాలి

ప్రకాశంనగర్: బీసీలకు తగ్గించిన పది శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని, రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీసీలకు ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులు అన్నారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, మెగా డీఎస్సీ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్, ప్రధాన కార్యదర్శి గొర్స తాతబ్బాయి యాదవ్, కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి పుష్పరాజ్ సస్పెన్షన్

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీ భరత్‌రామ్ స్థానిక నాయకులను పిలవకుండా కోటిలింగాలపేటకు పార్టీకి చెందిన వారినే మళ్లీ వైఎస్సార్ సీపీలో చేర్చుకున్నారంటూ విలేకరుల సమావేశంలో అదే పార్టీకి చెందిన మర్రి పుష్పరాజ్ విమర్శలు చేశారు. పార్టీ నియమ నిబంధనలను అతిక్రమించినందుకు 41వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మర్రి పుష్పరాజ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగరపాలక సంస్థలోని ప్రధాన మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతుల నిమిత్తం శుక్ర, శనివారాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎస్ఈ పాండంగారావు గురువారం తెలిపారు. దీని ప్రభావంతో నగరంలోని 1, 2, 3, 4, 5, 7, 8, 9, 10, 11, 37, 42, 43, 44, 50 డివిజన్లలో శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం సమయాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మహిళలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి అన్నారు. కొంతమూరు శానిటోరియంలో గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న యానాది, చెంచు, మందుల కమ్యూనిటీ సభ్యులు 10 మందికి ఆమె చేతుల మీదుగా ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడుతూ కుట్టు మెషీన్లు తీసుకున్న మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. గ్రేస్ చారిటబుల్ సంస్థ ఫౌండర్ రోషన్ వర్గిల్ వాసా మాట్లాడుతూ చెన్నైకి చెందిన డబ్ల్యూహెచ్‌బీఎల్ సంస్థ సౌజన్యంతో ఈ మెషీన్లు అందిస్తున్నామన్నారు. హరిత దళం మేనేజర్ వై.చిట్టిబాబు, సిబ్బంది జీవీపీ దుర్గాదేవి, ఎం.మరియకుమారి, బి.నరేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

'తిరుమల'లో వైభవంగా సరస్వతీ హోమం



తిరుమలలో సరస్వతీ మాతకు నమస్కరిస్తున్న అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో గురువారం నాగభట్ల కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో వింజమూరి సుబ్బారావు బృందంచే సరస్వతీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ మాట్లాడుతూ పౌర్ణమి గురువారం కావడం చాలా విశిష్టమైందని, ఈ రోజు సరస్వతి అమ్మవారిని పూజించడం మంచిదన్నారు. తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు దంపతులు ఈ హోమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. సతీష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులంతా విద్యతో పాటు, మంచి బుద్ధిని కలిగి ఉండాలన్నారు. లక్ష్యాలను నెరవేర్చుకోవడంలో మన శ్రమ ఎంత ఉన్నప్పటికీ, ఆ భగవంతుని ఆశీస్సులు కూడా అవసరమన్నారు. తిరుమల విద్యా సంస్థల ప్రిన్సిపల్ శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



ధవళేశ్వరంలో సీనియర్ సిటిజన్లకు సత్కారం

కంబాలచెరువు: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా కీలకమైందని స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆమె అధ్యక్షతన కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3 ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు. నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, అకడమిక్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునీత, కె.నీరజ, డీవీకేఎస్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓలు ఎం.కాస్మ, పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. ఓటరు ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సత్య సౌందర్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు ఎంకేఎస్ ప్రసాద్, కె.సుధారాణి, తేజ, వీరబాబు, సునీత, ప్రేమజ్యోతి పాల్గొన్నారు.

ధవళేశ్వరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆర్‌ఓఎస్ సరళవందన అన్నారు. ధవళేశ్వరం గరల్స్ హైస్కూల్‌లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ వరకూ ఓటరుగా నమోదుకు అవకాశం ఉందన్నారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పోలింగ్ బూత్‌లలో సీనియర్ ఓటర్లను బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు సత్కరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూపర్‌వైజర్లు సూచించారు.

ఉద్యోగులకు క్రీడా పోటీలు

ధవళేశ్వరం: స్థానికంగా జలతరంగిణి ఆధ్వర్యంలో జల వనరుల శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఉద్యోగులకు స్పోర్ట్స్ అండ్ కల్చరల్ పోటీలు జరిగాయి. విజేతలకు శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు జలతరంగిణి నాయకులు నల్లగాటి రామేశ్వరనాయుడు, రాజేశ్వరరావు తెలిపారు.

బాధితులకు ఎంపీ పరామర్శ

కంబాలచెరువు: స్థానిక బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రజనీదేవి, ఆమె భర్త ధనరాజులను ఎంపీ భరత్‌రామ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై అమానుషంగా దాడి చేసిన వారిని వదిలేది లేదని ఆయన అన్నారు. రెండు రోజుల కిందట వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ సమీపంలో ఒక వ్యక్తి తన ఇంట్లోని వ్యర్థ పదార్థాలను గమేళాతో రోడ్డు డివైడర్లో మొక్కల మధ్య పోస్తుండగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధనరాజు, అతని భార్య రజనీదేవి చూసి అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. సదరు వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ గమేళాతో వారిని గాయపరిచాడని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. రజనీదేవి వైద్యానికి అన్నిరకాల సహాయ సహకారాలు నగరపాలక సంస్థ అందిస్తుందని ఎంపీ చెప్పారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ విజయ్‌పాల్‌ను ఈ ఘటనకు సంబంధించి వివరాలు అడిగారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న, జనరల్ ఫిజీషియన్ విద్యాదీపక్, సతీష్, డీఎంఆర్ మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ దీపక్ ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

రాజానగరం: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కేవీ కృష్ణారావు అన్నారు. 35వ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా లైసెన్స్‌లు, ఫిట్‌నెస్‌ల కోసం రాజానగరంలోని డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌కు వచ్చిన వాహనదారులకు రహదారి భద్రతపై గురువారం అవగాహన కల్పించారు.

రూ.97 వేల చోరీ

కంబాలచెరువు: ఏటీఎమ్ కార్డు మార్చి రూ.97 వేలు చోరీ చేసిన ఘటనపై స్థానిక ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. స్థానిక రహమత్‌నగర్‌కు చెందిన ఎస్.సుజాత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆమెకు కొంత సొమ్ము అవసరమై స్థానిక ఏటీఎంకు తన కుమార్తెను పంపింది. అక్కడ ఒక అపరిచిత వ్యక్తి కార్డు పిన్ నంబర్ తెలుసుకున్నాడు. తర్వాత ఆమెను మాటల్లో దింపి ఏటీఎం కార్డు మార్చేశాడు. తర్వాత ఆమె ఇంటికి వెళ్లిపోయింది. అనంతరం తన ఖాతాలో రూ.97 వేలు నగదు మాయం కావడం గుర్తించిన సుజాత పోలీసులను ఆశ్రయించింది.

క్రీడా నైపుణ్యం పెంచేందుకు చర్యలు



క్రీడా, మౌలిక నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

కంబాలచెరువు: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు లైవ్ యునైటెడ్ వే సంస్థ (బెంగళూర్) ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం లైవ్ యునైటెడ్ వే సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న క్రీడా మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు నెలల్లో ఈ పనులు కొటక్ మహీంద్రా సౌజన్యంతో యునైటెడ్ వే సంస్థ పూర్తి చేస్తుందన్నారు. నగరంలో ఆనందనగర్, క్వారీపేట, నాగరాజ, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగకరంగా పలు కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోందన్నారు. స్టెమ్ ల్యాబ్, క్రీడా పరికరాలు, విద్యా బోధన కిట్లు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు, శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. కొటక్ మహీంద్ర బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.సుబ్రహ్మణ్యం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీఎస్ ప్రకాశరావు, ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.రాజా ప్రశాంత్, లైవ్ యునైటెడ్ వే సంస్థ అసిస్టెంట్ మేనేజర్ భాగ్యకుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వినోద్‌కుమార్, కొటక్ మహీంద్రా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.









